క్లుప్తంగా

టెన్నిస్ కోర్టు ప్రారంభం

ఇల్లెందు: పట్టణంలోని జేబీఎస్ హైస్కూల్‌లో టేబుల్ టెన్నిస్ కోర్టును ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం ప్రారంభించారు. మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టెన్నిస్ క్రీడలో రాణించిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు డానియేల్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, వత్స వెంకటేశ్వర్లు, రాజేందర్, కిన్నెర నర్సయ్య, పింగళి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: పాతకొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఈవీకే మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. దివంగత ఈసంపల్లి విజయ్‌కుమార్ జయంతి సందర్భంగా వారి కుమారులు చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, కుమార్తె కృష్ణవేణి 70 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. విజయ్‌కుమార్ సతీమణి సరోజ, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం

ఇల్లెందు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశ వ్యాప్తంగా సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో పట్టణ, మండల బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర పాసీ, భట్టు రమేష్, దోమల మహేశ్వర్, మోకాళ్ల శిరీష, సతీష్, వినోద్, జయప్రకాష్, రాజేష్, సందీప్, పూణ్యా నాయక్, గంగా, సునీత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హరితవనాల పరిశీలన

జూలూరుపాడు: జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధి వినోభానగర్, నల్లబండబోడు అటవీ బీట్లలోని హరితవనాలను శుక్రవారం రిటైర్డ్ ఎఫ్‌డీఓ ప్రసాద్ నేతృత్వంలోని బృందం పరిశీలించింది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద టేకు, వెదురు మొక్కలు నాటిన హరితవనాలను చూసి రిటైర్డ్ ఎఫ్‌డీఓ ప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుండెపుడి డీఆర్‌ఓ నాసూర్‌బీ, రాజారావుపేట అటవీ సెక్షన్ ఆఫీసర్ హారిక, వినోభానగర్, నల్లబండబోడు బీట్ ఆఫీసర్లు రేఖ, చరణ్ పాల్గొన్నారు.

సింగరేణి లాభాల్లో వాటా తేల్చండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా తేల్చాలని, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావలీ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో రీజియన్ కమిటీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో ఎంతోకాలం బొగ్గు నిల్వలు లేవని మాట్లాడటం సరికాదన్నారు. ఈ ప్రకటన కార్మికులకు కంటిమీద కునుకు లేకుండా చేసిందన్నారు. కార్మికుల సొమ్మును తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు సేఫ్ నిధుల పేరుతో సింగరేణిని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు తక్కువ వేతనాల వల్లనే సింగరేణిలో లాభాలు వస్తున్నట్లు చెప్పారు. మధుసూదన్‌రెడ్డి, వై.పుల్లయ్య, అమర్లపూడి శరత్, పెద్దబోయిన సతీష్, జాన్, సంజీవరెడ్డి, రమేష్, షఫీ ప్రసాద్ పాల్గొన్నారు.

సోలార్ లైట్లు పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని గరీబ్‌పేట గ్రామానికి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా 15 సోలార్ ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్లను (విత్ పోల్స్) శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలో జీఎం శాలేం రాజు అందజేశారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ సీఎస్సార్ పాలసీలో భాగంగా సమీప గ్రామాల అభివృద్ధికి అనేక సౌకర్యాలు కల్పిస్తోందని ఇందులో భాగంగా సోలార్ స్ట్రీట్ లైట్లను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా గ్రామాలలోని చెట్ల సంరక్షణకు ట్రీగార్డ్‌లను అందిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, డీజీఎం పర్సనల్ రామ్మోహన్‌రావు, యూనియన్ల నాయకులు, అధికారులు, సెక్రటరీ రోహిణి పాల్గొన్నారు.

కళ తప్పిన జాతీయ రహదారి

- డివైడర్‌లో ఏపుగా పిచ్చిమొక్కలు
- వీధిదీపాలు లేక తరుచూ ప్రమాదాలు
- సీఎస్పీ బస్తీలో ఎవరికీ పట్టని రోడ్డు నిర్వహణ


రోడ్డుకు ఇరువైపులా, డివైడర్‌లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ఇల్లెందురూరల్: పేరుకు జాతీయ రహదారి.. బొగ్గు రవాణా కోసం ఈ రోడ్డుకు సింగరేణి సంస్థ మరిన్ని సొబగులు అద్దింది. కానీ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రహదారిపై సింగరేణి అద్దిన సొబగులు నేడు కళావిహీనంగా, ప్రమాదకరంగానూ మారాయి.

జాతీయ రహదారిపై నూతన హంగులు..

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో గౌరెల్లి నుంచి జిల్లాలోని కొత్తగూడేనికి జాతీయ రహదారి నిర్మాణం కోసం నేషనల్ హైవే అథారిటీ అధికారులు ముందస్తుగా మహబూబాబాద్ నుంచి కొత్తగూడెం వరకు ఉన్న ప్రధాన రహదారిని ఆరేళ్ల క్రితం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఇదే రహదారిపై మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ పరిధిలో సింగరేణి సంస్థ సీఎస్పీ నుంచి బొగ్గు రవాణా చేసేందుకు భవిష్యత్ అవసరాల దృష్ట్యా జాతీయ రహదారి మీదుగా ఓవర్ బ్రిడ్జి నిర్మించింది. సమీపంలో ఉన్న కూడలిని ఆధునీకరిస్తూ సీఎస్పీ బస్తీ నుంచి రాజీవ్‌నగర్‌తండా సమీపం వరకు డివైడర్, కూడలిలో రింగు కూడా నిర్మించింది. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలతో పంచాయతీ అభివృద్ధి చెందుతుందని స్థానికులు సంబురపడ్డారు.

నిర్వహణ లేక కళావిహీనం..

జాతీయ రహదారిపై నూతన హంగులతో సింగరేణి చేపట్టిన ఆధునికీకరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూడలిలో హైమాస్ లైటింగ్ కోసం నిర్మించిన రింగు, అందులో ఏర్పాటు చేసిన స్టాండు శిలావిగ్రహంగా నిలిచిపోయాయి. డివైడర్‌లో కనీసం ఒక్క మొక్క కూడా నాటలేదు. ఇక ప్రధాన రహదారిపై నిర్మించిన డివైడర్‌ను రాత్రివేళలో వాహన చోదకులు గుర్తించేలా కనీసం ఒక్క లైట్ కూడా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు ప్రస్తుతం రహదారికి ఇరువైపులా, మధ్యలో డివైడర్‌పై పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి జాతీయ రహదారిని కళావిహీనంగా మార్చేశాయి.

వరుస ప్రమాదాలతో ఆందోళన...

సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో సీఎస్పీ బస్తీ గ్రామం చివరి నుంచి రాజీవ్‌నగర్ తండా గ్రామ పొలిమెర వరకు సింగరేణి సంస్థ జాతీయ రహదారిపై డివైడర్ నిర్మించింది. నిర్మాణం ప్రారంభంలోనే ఓ ద్విచక్రవాహనం నేరుగా డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటనతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు తమ బాధ్యతను విస్మరించడం ప్రయాణికులకు శాపంగా మారింది. డివైడర్ నిర్మించిన చోట రహదారిని వెడల్పు చేసిన అధికారులు అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించలేదు. ఫలితంగా ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదాలలో ఇప్పటి వరకు ముగ్గురు మృతి చెందగా పలువురు గాయపడ్డారు.

ఎవరికీ పట్టని నిర్వహణ... సాధారణంగా ప్రధాన రహదారిపై డివైడర్ నిర్మిస్తే సహజంగానే మధ్యలో అందమైన పూల మొక్కలు పెంచుతారు. నిధుల వెసులుబాటును బట్టి డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. ఇవేమీ లేకుండానే ఆరేళ్లుగా జాతీయ రహదారిపై సుమారు 200 మీటర్ల దూరం నిర్మించిన డివైడర్ ప్రస్తుతం పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. వనరులు, అవకాశం ఉన్నా సింగరేణి సంస్థ డివైడర్‌పై పచ్చందాల సౌకర్యం కల్పించడాన్ని నిర్లక్ష్యం చేయడం, నిధుల లేమి, సిబ్బంది కొరత పేరుతో గ్రామపంచాయతీ అధికారులు నిర్వహణ బాధ్యతను విస్మరించడంతో జాతీయ రహదారిపై డివైడర్ ప్రస్తుతం కళావిహీనంగా దర్శనమిస్తోంది.


వాహనాలు ఢీకొట్టడంతో కూలిన డివైడర్

సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి...



సీఎస్పీ బస్తీ గ్రామం నుంచి రాజీవ్‌నగర్ తండా గ్రామం వరకు నిర్మించిన డివైడర్‌పై పచ్చదనం వెల్లివిరిసేలా మొక్కలు నాటాలి. డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. దీనికోసం సింగరేణి సంస్థ చొరవ తీసుకొని ప్రధాన రహదారిని సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి.

– తాళ్ల శివ, సీఎస్పీ బస్తీ

నిర్వహణ లేకే ప్రమాదాలు...



జాతీయ రహదారిని మరికొంత వెడల్పు చేసి మధ్యలో డివైడర్ నిర్మించారు. నిర్మాణ సమయంలోనే డివైడర్‌ను వాహన చోదకులు ఢీకొట్టి మృత్యువాత పడ్డారు. అయినా సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడం, నిర్వహణ లేకే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– షేక్ నాగుల్‌పాషా, రాజీవ్‌నగర్ తండా

సింగరేణికి నివేదిస్తాం...



సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారిపై సింగరేణి సంస్థ నిర్మించిన డివైడర్ కళావిహీనంగా మారడం, లైటింగ్ లేమి కారణంగా తరచు జరుగుతున్న ప్రమాదాలను గుర్తించాం. సౌకర్యాలు మెరుగుపర్చేలా సింగరేణి అధికారులకు నివేదిక ఇస్తాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

వృత్తి విద్య కోర్సుల ప్రావీణ్య పరీక్ష


పరీక్షకు హాజరైన వారితో జీఎం కృష్ణయ్య, సేవా అధ్యక్షురాలు రమ

ఇల్లెందు: జేకే ఓసీ విస్తరణ ప్రభావిత ప్రాంతాల, పట్టణ నిరుద్యోగ మహిళలకు వృత్తి విద్య కోర్సులకు శుక్రవారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. సింగరేణి సేవా సమితి, ఖాదీ గ్రామీణద్యోగ మహా విద్యాలయం ఆధ్వర్యంలో జేకే సింగరేణి పాఠశాలలో జీఎం వీసం కృష్ణయ్య, సేవా సమితి అధ్యక్షురాలు వీసం రమ రాత పరీక్షను ప్రారంభించారు. 2024–25 లో ఇల్లెందు ఏరియాలోని జేకే కాలనీలో టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకున్న మహిళలకు ఈ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం తుకారాం, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ అజయ్, హైదరాబాద్ విభాగం సేవాసమితి కోఆర్డినేటర్ శివకుమార్, సేవా కార్యదర్శి సులక్షణ, ఇల్లెందు కోఆర్డినేటర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే సమాజ ఉన్నతికి సోపానం

ఇల్లెందు: సివిల్ లైన్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఇల్లెందులపాడు సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహారం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. మాజీ కౌన్సిలర్ తార, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు సమాజం ఉన్నతంగా ఉంటుందని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత అన్నారు. రొంపేడు పీహెచ్‌సీలో 'మహిళల ఆరోగ్యం – తీసుకోవాల్సిన జాగ్రత్తలు'అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రతీ ఏఎన్‌ఎం తమ పరిధిలోని మహిళల ఆరోగ్య స్థితిగతులపై నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. దీని ఆధారంగా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దీనికోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని తెలిపారు.

ఆటో డ్రైవర్ల పాదయాత్ర


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య నేతృత్వంలో శుక్రవారం చుంచుపల్లి మండలం బైపాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ఆటోడ్రైవర్లు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కమిటీ తరపున కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని స్వాగతిస్తున్నామని అయితే ఈ పథకం ద్వారా ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పాదయాత్ర కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం ఆటోడ్రైవర్లు ధర్నా నిర్వహించి కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, జీ.వీరస్వామి, వాసిరెడ్డి మురళి, వేల్పుల మల్లికార్జున్, ఆటో యూనియన్ నాయకులు బత్తుల సత్యనారాయణ, మర్రి కృష్ణ, ఆరేల్లి కృష్ణ, అబ్బులు, భాషా, చింటూ, ఎం.లక్ష్మణ్, జోసఫ్, అమిత్, మంద శ్రీను, బి.భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


ధర్నా నిర్వహిస్తున్న వర్కర్లు

ఇల్లెందు: తమ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 8 రోజులుగా సాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ వర్కర్లను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపిస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించారు. శుక్రవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి జేకేలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, జేఏసీ నేత నాగేశ్వరరావు మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేసే డైలీవేజ్ వర్కర్లకు చెల్లించే వేతనం రూ.26 వేల నుంచి రూ.11 వేలకు తగ్గించారని తెలిపారు. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ సూర్యం చొరవతో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ధర్నా చేస్తున్న వర్కర్ల కోరిక మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్య వర్కర్ల ముందే మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఏ నబీ, కృష్ణ, భద్రయ్య, ముత్తయ్య, నాగేశ్వరరావు, స్వామి, మంగ, లక్ష్మణ్, పాపారావు, రఘు, నాగులు, స్వరూప, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ డైలీవేజ్ వర్కర్లు సమ్మె కొనసాగిస్తున్నారు. శుక్రవారం సమ్మెలో భాగంగా మండల కేంద్రం జూలూరుపాడులో దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేసి నిరసన తెలిపారు.

వర్కర్లు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 64 నిలిపివేయాలని కోరారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ రాజు, కె.లక్ష్మి, గుమ్మడి రాజేశ్వరి, బానోత్ తులసి, వెంకటమ్మ, భూక్యా శాంత, చంద్రు, రాధ, ఈసాల లక్ష్మి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బిషప్ కౌన్సిల్

ఇల్లెందు: తెలంగాణ బిషప్ కౌన్సిల్ సభ్యులు, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను హైదరాబాద్ సచివాలయంలో ఆయన చాంబర్‌లో తెలంగాణ బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు విక్రమ్ పాల్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. క్రైస్తవ సమాజానికి కావాల్సిన బరియల్ గ్రౌండ్, కమ్యూనిటీ హాల్స్, ఫ్రీజర్ బాక్స్‌లు, చర్చి నిర్మాణం, నిర్వహణ సడలింపు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

విధుల్లో చేరిన ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి



టేకులపల్లి: బోడు పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా ఇల్లెందులో పనిచేసిన పొలిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన శ్రీకాంత్ బదిలీ అయ్యారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఇల్లెందు: పట్టణంలోని సాహితీ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎంవీ నాగిరెడ్డి, చాగర్ల కృష్ణమూర్తి, సింగరేణి పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. చదువులో పేద ధనిక తేడా ఉండదని చెప్పారు. ఉపాధ్యాయులు బొద్దుల శ్రీనివాసరావు, చాగంటి కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ రాంబాబు పాల్గొన్నారు.

జోనల్ గేమ్స్‌లో రాణించిన విద్యార్థులు

టేకులపల్లి: రుద్రంపూర్‌లో రెండు రోజులు జరిగిన కొత్తగూడెం జోనల్ గేమ్స్‌లో టేకులపల్లి మండల విద్యార్థులు ప్రతిభను కనబరిచి అత్యధిక బహుమతులు గెలుచుకుని ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. ఈ జోనల్ గేమ్స్‌లో టేకులపల్లి మండలానికి చెందిన పీడీ, పీఈటీలు వెంకటేశ్వర్లు, కస్నా, శేఖర్, మంజీలాల్, మదన్, సీత పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలు చేయాలని, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామన్న ప్రభుత్వం రెండేళ్లయినా యూత్ డిక్లరేషన్ ప్రకటించిన ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. మరోవైపు టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో విఫలమైందన్నారు.

ప్రతీ గ్రామానికి పటిష్టమైన రోడ్లు


చుంచుపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: రహదారుల సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ముందస్తు ప్రణాళికతో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక, లక్ష్మీపురం, మైలారం, రేగళ్ల, గట్టుమల్ల గ్రామపంచాయతీల పరిధిలో రూ.1.48 కోట్ల నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపనలతో పాటు పూర్తయిన పనులను ప్రారంభించారు. మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల పరిధిలోని రేగళ్ల – కరకవాగు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.10కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామాల అనుసంధాన, అంతర్గత రోడ్లు పటిష్టంగా నిర్మిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని, ప్రతీ గ్రామంలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు అనతికాలంలోనే సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్ పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, దీటి లక్ష్మీపతి, దారా శ్రీను, కంటెం సత్యనారాయణ, జోగా రామయ్య, నూనావత్ గోవిందు, కోడి లింగయ్య, పరుపర్తి రాజు, జోగా రాజబాబు, రమేష్, సర్వాన్, శాపావత్ రవి, జర్పుల ఉపేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేద విద్యార్థులు విద్యనభ్యసించే ప్రభుత్వ విద్యాసంస్థలలో సౌకర్యాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో రూ.3.92 కోట్ల టీజీఈడబ్ల్యూఐడీసీ నిధులతో నిర్మించనున్న నూతన భవనాల సముదాయానికి, రూ.58 లక్షల వ్యయంతో చేపట్టనున్న మరమ్మతు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ కత్తి రమేష్, కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గోపయ్య మృతికి ఎమ్మెల్యే సంతాపం

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దుద్దుకూరి రామారావు తండ్రి గోపయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శుక్రవారం గోపయ్య కుటుంబాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా గోపయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఇల్లెందు: విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని జేబీఎస్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు. ఈ సందర్భంగా అక్కడి భవిత కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అధ్వానంగా ఉన్న భవిత కేంద్రం మరమ్మతు పనులు ముఖ్యంగా టాయిలెట్స్ రిపేరు, ఫ్లోరింగ్, ప్లాస్టింగ్, విద్యుత్ వైరింగ్, నీటి సదుపాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో భవిత కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ఆరు పాత భవనాలు మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 40 పాఠశాలల్లో దివ్యాంగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. దివ్యాంగ విద్యార్థుల కోసం భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నామని, ప్రత్యేకంగా ఫిజియోథెరపిస్ట్‌ల సేవలను నెలకు రెండుసార్లు అన్నిమండలాల్లో అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సౌకర్యాన్ని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కోరారు. హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, యూసఫ్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యాన నిరసన


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం మొండివైఖరికి నిరసనగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జీఎం శాలేంరాజుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అదనపు కార్యదర్శి మిరియాల రంగయ్య మాట్లాడుతూ సీఎండీతో జరిగిన స్ట్రక్చరల్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న డిమాండ్లపై వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని, 2024–25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీకి వచ్చిన వాస్తవ లాభలు ప్రకటించి అందులో 35శాతం లాభాల వాటాను కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, లేదంటే కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తామని, అవసరమైతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి..

పాల్వంచరూరల్: మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం విద్యార్థులు అలవాటుగా చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా స్వచ్ఛభారత్ సంకల్పాన్ని సాధించవచ్చన్నారు. ప్రతీఒక్కరు వారంలో కనీసం రెండు గంటల పాటు స్వచ్ఛందగా పనిచేయడానికి సమయాన్ని కేటాయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.పద్మ, ఎస్‌బీఎం కన్సల్టెంట్ రేవతి, ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీఓ పొరండ్ల రంగా, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె.మాధవి, డాక్టర్ వి.కామేశ్వరరావు, ఎన్.శ్రీదేవి, డి.రమేష్, కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు సరే.. సౌకర్యాలు ?


కుళాయి నీటిని క్యాన్‌లో పట్టుకుంటున్న విద్యార్థులు

పాల్వంచరూరల్: ఎండకాలాన్ని తలపించేలా ఎండలు మండుతుంటే కనీసం నీడ సౌకర్యం కల్పించేందుకు టెంట్లు గానీ, స్వచ్ఛమైన తాగునీటిని గానీ ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. మండలంలోని కిన్నెరసానిలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో శుక్రవారం పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి మండలాలకు చెందిన విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 300 పైన విద్యార్థులు హాజరయ్యారు. మండుటెండల్లో ఆడిన విద్యార్థులు ఒక గేమ్ తర్వాత మరో గేమ్‌లో పాల్గొనే సమయంలో కనీసం కాసేపు నీడలో కూర్చొనేం టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు మైదానం పక్కన చెట్ల నీడలో కూర్చున్నారు. ఇదిలా ఉంటే మైదానంలో క్రీడాపోటీల వద్ద తాగునీటి సౌకర్యం కూడా కల్పించ లేదు. వేదిక వద్ద ఉన్న కుళాయి ద్వారా వస్తున్న కలుషితమైన నీటితోనే విద్యార్థులు దాహార్తిని తీర్చుకోవడం కనిపించింది. క్రీడల నిర్వహణకు నిధులు వచ్చిన అధికారులు మాత్రం పైసా ఖర్చు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిచడంతో విద్యార్థులు అవస్థ పడుతూ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం బతుకమ్మ


ఇల్లెందురూరల్: సుదిమళ్ల గురుకులంలో బతుకమ్మ పేరుస్తున్న ఉపాధ్యాయినులు


టేకులపల్లి కేజీబీవీలో బతుకమ్మలతో ఎస్‌ఓ, ఉపాధ్యాయినులు

ఇల్లెందురూరల్: పూల పండుగ పరిమళాలతో మండలంలోని పలు పాఠశాలలు శుక్రవారం హోరెత్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ పండుగను ముందుస్తుగా వైభవంగా నిర్వహించుకున్నారు. పాఠశాలల ఆవరణలలో బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆటపాలతో సందడి చేశారు. హెచ్‌ఎంలు మాట్లాడుతూ.. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు మన పండుగలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకే ముందస్తుగా బతుకమ్మ పండుగ నిర్వహించినట్లు చెప్పారు.

టేకులపల్లి: 21 నుంచి అక్టోబర్ 3 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించింది. కేజీబీవీ, ఆశ్రమ, గురుకులాలు, గిరిజన పీఎంహెచ్ బాలబాలికలు శనివారం నివాసాలకు వెళ్తారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా శుక్రవారం టేకులపల్లి కేజీబీవీ పాఠశాల, కళాశాలలో దసరా, బతుకమ్మ సంబరాలతో పాటు టీచర్స్ డే నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎస్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416